కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె



కలెక్టరేట్ ఎదుట మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నస్పూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళన కొనసాగుతుందని జేఏసీ అధ్యక్షురాలు సుమలత, ప్రధాన కార్యదర్శి రాజన్నలు తెలిపారు. మాజీ ప్రధాన మంత్రి, ఆర్థిక వేత్త డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి చెందడంతో ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెను విరమింపజేయాలి

గర్మిళ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెను విరమింపజేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమ్మె చేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయుల స్థానంలో ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించడాన్ని ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, డిప్యూటేషన్‌లను రద్దు చేయాలన్నారు.

మద్దతు ధరతో పత్తి రైతులు లబ్ధి పొందాలి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కనీస మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేస్తుందని, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మార్కెటింగ్ అధికారి షాబొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో జిన్నింగు మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం ఈ నెల 27 వరకు 1,06,420 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశామని తెలిపారు. పత్తి క్వింటాలుకు రూ.7421 చెల్లిస్తున్నామన్నారు. రైతులు పత్తి పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు



- నియోజకవర్గాల వారీగా అభివృద్ధికి చర్యలు
- జిల్లా కేంద్రంలో సుమారు రూ.వెయ్యి కోట్లతో పనులు
- రూ.324 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి
- ఇండోర్ స్టేడియానికి మోక్షం
- హిందూ శ్మశాన వాటికతో తొలగనున్న ఇబ్బందులు
- బెల్లంపల్లి ప్రజలకు తాగునీటి భాగ్యం
- చెన్నూరులో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు



సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు (ఫైల్)

మంచిర్యాల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు ముందుకు సాగుతున్నారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న పనులు ఎట్టకేలకు కొలిక్కి వస్తున్నాయి. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, గడ్డం వివేకానంద్, గడ్డం వినోద్‌లు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

మంచిర్యాల నియోజకవర్గంలో....

జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. ఐబీ సమీపంలోని పాత ప్రభుత్వ అతిథిగృహ ఆవరణలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రూ.324 కోట్ల అంచనాతో ఆసుపత్రి భవన నిర్మాణం చేపట్టనున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించారు. దీంతో ఆసుపత్రి నిర్మాణానికి మార్గం సుగమంకాగా గత నెల 21న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు శంకుస్థాపన చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంతో మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, రాష్ట్రాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి. అదే ప్రాంగణంలో మాతా, శిశు సంరక్షణ కేంద్రాన్ని నిర్మించనున్నారు. రెండు ఆసుపత్రులు ఒకే ప్రాంగణంలో నిర్మించడం వల్ల రోగులకు వైద్యసేవల పరంగా అందుబాటులో ఉండనున్నాయి. ఎంసీహెచ్ గోదావరి సమీపంలో ఉండటంతో వర్షాకాలంలో యేటా వరద ముంపునకు గురవుతోంది. దీంతో ఎంసీహెచ్‌ను కూడా ఐబీ సమీపంలోనే నిర్మిస్తున్నారు.

రూ. 260 కోట్లతో కరకట్టల నిర్మాణం...

మంచిర్యాల పట్టణంలోని రాళ్లవాగుకు కరకట్టల నిర్మాణం చేపట్టడం ద్వారా వరదను నివారించడానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. కార్మెల్ స్కూల్ బ్రిడ్జి నుంచి 7.5 కిలోమీటర్ల పొడవుతో సుమారు 140 మీటర్ల ఎత్తుతో ఇరువైపులా కరకట్టలు నిర్మించనున్నారు. రూ. 260 కోట్ల అంచనాతో కరకట్టల నిర్మాణం జరుగనుంది. రాళ్లవాగు ప్రవాహంతో జిల్లా కేంద్రంలోని ఏడెనిమిది కాలనీలు వర్షాకాలంలో వరద ముంపునకు గురవుతు న్నాయి. ప్రతిసారీ వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా ఎమ్మెల్యే కృషితో కరకట్టల నిర్మాణానికి మోక్షం లభించింది.



మందమర్రిలో రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వివేక్ (ఫైల్)

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మోక్షం...

జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మోక్షం కలిగింది. సాయికుంటలో ప్రభుత్వ స్థలం సర్వే నెంబర్లు 662, 675లలో 10 ఎకరాల స్థలాన్ని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సూచనలతో స్పోర్ట్స్ అథారిటీకి కేటాయిస్తూ రెవెన్యూశాఖ నిర్ణయం తీసుకుంది. ఆ స్థలంలో సుమారు రూ.30 కోట్ల అంచనాతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మించేందుకు మార్గం సుగమ మైంది. వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, బ్యా డ్మింటన్, జూడో, రెజ్లింగ్, టేబుల్‌టెన్నిస్ ఆడేందుకు ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే సింథటిక్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్ నిర్మించనున్నారు. ఇండోర్ స్టేడియం అంచనా వ్యయంలో కొంత మొత్తం ఖేలో ఇండియా భరించనుండగా, మిగతా నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించనుంది. ఇండోర్ స్టేడియం ఆవరణలో స్పోర్ట్స్ హాస్టల్ నిర్మాణం చేపట్టేందుకూ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

శ్మశాన వాటిక నిర్మాణంతో తీరనున్న కష్టాలు...

జిల్లా కేంద్రంలో హిందూ శ్మశానవాటిక లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. గోదావరి ఒడ్డున శ్మశాన వాటిక నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. భూదాన్ భూములు నాలుగు ఎకరాల్లో రూ.4 కోట్ల నిధులతో శ్మశాన వాటికకు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఇటీవల శంకుస్థాపన

మిగతా 7లో

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

చెన్నూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యను పరిష్కరించాలని శుక్రవారం గంగారాం గ్రామంలోని ప్రధాన రహదారిలోని కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ తమ ఇండ్లకు తాగునీరు సరఫరా చేసే బోరుకు అమర్చిన విద్యుత్ మోటారు కాలిపోయి ఐదు నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. దీంతో నీటి కోసం తీవ్ర ఇబ్బం దులు పడుతున్నామన్నారు. బోరుకు విద్యుత్ మోటారు అమర్చేవారు లేక దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామన్నారు. వెంటనే విద్యుత్ మోటారు బోరుకు అమర్చి నీటి కష్టాలు తీర్చాలని కోరారు.

నేటి నుంచి బ్యాంకు సేవలకు అంతరాయం

కోటపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలకు శనివారం నుంచి ఈనెల 31 వరకు అంతరాయం ఉంటుందని మేనేజర్ ఎస్.రాజేష్ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు రాష్ట్రంలోని శాఖలు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం అవు తున్నాయని, ఫలితంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు, యుపీఐ, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ లాంటి సేవలు అందుబాటులో ఉండవన్నారు. జనవరి 1 నుంచి సేవలు అందుబాటులోకి వస్తాయని, ఖాతాదారులు సహకరించాలని తెలిపారు.

కవ్వాల అభయారణ్యంలో పర్యటన



అభయారణ్యంలో పర్యటిస్తున్న ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్టు డాక్టర్ హేమంత్

జన్నారం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల టైగర్ జోన్‌లో శుక్రవారం ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్టు డాక్టర్ హేమంత్ పర్యటించారు. బైసన్‌కుంట, మైసమ్మకుంటతోపాటు గన్‌శెట్టికుంటలో పర్యటించి పక్షులను వీక్షించారు. అభయారణ్యం మరింత అభివృద్ధి చెందుతుందని, అడవిలో పక్షులు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంతో పాటు వన్య ప్రాణులను కాపాడుకుంటేనే పర్యావరణ సమతుల్యత చెందుతుందన్నారు. ఇందన్‌పల్లి ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

ఎంపీపై అనుచిత పోస్టులు బీఆర్ఎస్ నేతపై కేసు నమోదు

తాండూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వాటిని ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపుల్లో పంపిస్తున్న బీఆర్ఎస్ నాయకుడిపై కేసు నమోదు చేసినట్లు తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం బీఆర్ఎస్ నేత గోగుల రవీందర్‌రెడ్డి ఎంపీని అవమానపరిచే విధంగా వివిధ వర్గాల మధ్య రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టారని కాంగ్రెస్ పార్టీ నాయకులు యాదగిరి గురువారం ఫిర్యాదు చేశాడన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

బకాయిలు చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు



రైసుమిల్లును తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి

జైపూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైసుమిల్లుల యజమానులు ధాన్యం బకాయిలు ప్రభుత్వానికి చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని సివిల్ సప్లయి టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ముదిగుంట గ్రామంలోని బీఎస్‌వై రా రైసుమిల్లు, టేకుమట్ల గ్రామంలోని బాలాజీ రైసుమిల్లులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ బాలాజీ రైసుమిల్లు నిర్వాహకులు 2023-24 ఖరీఫ్ సీజన్‌లో 2305 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందన్నారు. దీని విలువ రూ.5.5 కోట్లు అని తెలిపారు. అలాగే బీఎస్‌వై రా రైసుమిల్లు 2022-23 రబీ సీజన్‌లో 3858 మెట్రిక్ టన్నుల ధాన్యం, 2023-24 ఖరీఫ్ సీజన్‌లో 2687 మెట్రిక్‌టన్నుల ధాన్యం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందన్నారు. దీని విలువ సుమారు రూ.19 కోట్లుగా నిర్ధారించామని తెలిపారు. ఇద్దరు రైసుమిల్లుల నిర్వాహకులతో అంగీకార పత్రం రాయించుకున్నామని, ఈ నెల 31లోగా బకాయిలు చెల్లించకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపామన్నారు. తనిఖీల్లో అసిస్టెంట్ సివిల్ సప్లయి అధికారి వేణుగోపాల్, సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో నగదు జమ

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 317 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యానికి సంబంధించి రూ.76కోట్ల23 లక్షల నగదును సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేశామని అదనపు కలెక్టర్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 61,452 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 5,144 మంది రైతుల ఖాతాల్లో 76కోట్ల23 లక్షలు జమ చేశామన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన

తాండూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చలాపూర్, రేచిని, కొత్తపల్లి, కిష్టంపేట, గోపాల్‌నగర్ గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వేను పకడ్బందీగా తప్పులు లేకుండా నిర్వహించాలన్నారు. యాప్‌లో వివరాలను సరిగా నమోదు చేయాలన్నారు. సర్వే త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు.

పత్తికి మద్దతు ధర చెల్లించాలి



జిన్నింగు మిల్లు ఎదుట రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

చెన్నూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపేట గ్రామంలోని వరలక్ష్మీ జిన్నింగు మిల్లు ఎదుట పత్తికి మద్దతు ధర చెల్లించాలని రైతులు శుక్రవారం చెన్నూరు-మంచిర్యాల ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సీసీఐలో మంగళవారం వరకు పత్తి క్వింటాల్‌కు రూ.7520 ఉండగా, ప్రస్తుతం వంద రూపాయలు తగ్గించారని, దీంతో తాము నష్టపోతామని పేర్కొన్నారు. తగ్గించిన ధరలను పెంచాలని డిమాండ్ చేశారు. సుమారు 2 గంటల పాటు ధర్నా చేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ధర్నా వద్దకు చేరుకున్నారు. సీఐ రవీందర్, సీపీవోలు రైతులతో మాట్లాడి నచ్చజెప్పడంతో ధర్నాను విరమించారు.

CHANGE OF NAME

I, **MA MOIZ PASHA** S/O. **MA KHADAR PASHA,** R/O. H.No. 9-135/1, CCC, Adarsh Nagar. Mandal: Naspur, Dist: Mancherial, have changed my name from **MOHAMMAD MOIZ PASHA**(Old name) to **MOHAMMAD ABDUL MOIZ PASHA** (New Name)

SANTOOR

సంతూర్
ముత్యాల ముగ్గుల పోటీ

ఆంధ్రజ్యోతి
ABN

అందమైన ముగ్గులు వేయండి.. ఆనందంగా బహుమతులు అందుకోండి. రాష్ట్ర స్థాయిలో విజేతలకు రూ.1,50,000/-లకు పైగా బహుమతులు.

మంచిర్యాల :

స్పాన్సర్స్ : ప్రథమ, ద్వితీయ బహుమతులు : డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, డాక్టర్ రఘువంశీ

తృతీయ బహుమతి: సాన సుధతి, స్కూల్ ప్రిన్సిపాల్, కన్సోలేషన్ బహుమతులు: పత్తి వెంకటేష్

స్థలం: అభ్యాస స్కూల్, పాత మంచిర్యాల, బ్రిడ్జి సమీపంలో, ఆదిత్య ఎన్‌క్లేవ్, మంచిర్యాల

తేది : 05-01-2025, సమయం : ఉదయం : 9 గం॥ల నుండి, సంప్రదించవలసిన నెం. 9866561478, 9985411280

కాగజ్‌నగర్: ముగ్గుల పోటీ నిర్వహించు తేది: 05-01-2025, మిగతా వివరాలు త్వరలో....

నిబంధనలు: మహిళలు మాత్రమే పాల్గొనాలి. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు చెప్పగలిగి ఉండాలి. ముగ్గు, రంగులు వగైరా పోటీదారులే తెచ్చుకోవాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం 2 గంటలు

మొదటి బహుమతి రూ.6,000/-
రెండో బహుమతి రూ.4,000/-
మూడో బహుమతి రూ.3,000/-

యవ్వనపు చర్మ రహస్యం



Fashion Partner



DIGSEL WOMEN'S

సెల్సియా
ట్రెండీ మహిళల అంతర్గత దుస్తులు

selsia
TRENDY WOMEN'S



BRA - PANTIES - SLIPS & LEGGINGS
SCAN & BUY
TRADE ENQUIRY : 93445 53675

Gardening Partner

ఎటువంటి పంటలకైనా
క్రాఫ్ట్ వారి
పెర్‌ఫెక్ట్

ఆకు కూరలు, కూరగాయలు, పళ్ల పంటలు, మిరప, పొగాకు, పసుపు వంటి వాణిజ్యపంటలు, వరి, రాగి మొదలైన పంటలు, మిద్దెతోటలు, పెరటి తోటలకైనా చీడపీడలబారిన పడకుండా, లేదా చీడపీడలతో ఆకు ముడతతో పంట పాడైనా రామబాణం లాంటిది 'పెర్‌ఫెక్ట్'. ఒక్క లీటరు నీటికి కేవలం 2ఎంఎల్ పెర్‌ఫెక్ట్‌ను కలిపి పిచికారి చేయడం ద్వారా చీడపీడలు, ఆకుముడత, మిరపలో నల్లతామర వంటి రోగాలను నివారించి, ప్రారదోలి మొక్కలు నూతన జవసత్వాలతో ఏపుగా పెరిగి, (7-15 రోజులకొకసారి పిచికారి చేయవలసి ఉంటుంది) కొత్తపూత పిందెలతో అధిక దిగుబడినిస్తుంది.

- వృక్ష ఆయుర్వేదం (100%) ఆర్గానిక్
- సేంద్రియ వ్యవసాయం
- రసాయనిక అవశేషాలు లేని పంటల ఉత్పత్తి
- 11 వనమూలికల ఔషధ సమ్మేళనం
- సమగ్ర సస్య సంరక్షణ

B.Sc. (Agri), B.Sc.(Horti), Agri Business Management, Any Degree చేసినవారికి ఏరియా/ జిల్లాల వారీగా ఉద్యోగావకాశాలు కలవు. ఆకర్షణీయమైన ఆదాయం. ఆసక్తిగలవారు మెయిల్‌ద్వారాగానీ, ఫోన్‌ద్వారా గానీ సంప్రదించండి.



ఈమెయిల్ ID: globalgreenperfekt@gmail.com, వెబ్‌సైట్: www.perfektindia.in, కస్టమర్ కేర్ నంబర్లు: 94482 74211, 73377 74148

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సబ్‌స్టేషన్ ఎదుట కుటుంబీకుల ఆందోళన



మృతుడి కుటుంబీకులతో మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి



రవి (ఫైల్)

కన్నెపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొత్తపల్లి గ్రామానికి చెందిన లట్కారి రవి(30) శుక్రవారం తెల్లవారుజామున హైద్రాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయన మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకులు శుక్రవారం సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ నెల 20న రవి బొత్తపల్లి గ్రామంలోని ఓ రైతు పొలంలో ట్రాక్టర్‌తో జంబు కొట్టడానికి వెళ్లాడు. పొలంపై 11కేవీ విద్యుత్ వైర్లు కర్రల సహాయంతో ఉండడంతో ట్రాక్టర్ రివర్స్ చేస్తుండగా కర్రలకు తగిలి విద్యుత్ వైర్లు రవి మీద పడ్డాయి. దీంతో విద్యుత్‌షాక్‌కు గురైన రవి తీవ్ర గాయాలపాలయ్యాడు. రవిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. రవి మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని మృతుడి భార్య, కుటుంబీకులు సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. విద్యుత్ వైర్లు సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతోనే వైర్లు మీద పడి మృతిచెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. రవి మృతిచెందడంతో దివ్యాంగురాలైన అతనిభార్యకు ఆధారం లేకుండా పోయిందని, ప్రభుత్వఉద్యోగం ఇవ్వాలని కుటుంబీకులు డిమాండ్ చేశారు. తాండూర్ సీఐ కుమారస్వామి, కన్నెపల్లి ఎస్‌ఐ గంగారాంలు సంఘటనస్థలానికి చేరుకుని నచ్చజెప్పగా ఆందోళన విరమించారు. మృతుడికి భార్య లావణ్య, ఒకకొడుకు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న రూరల్ సీఐ అఫ్జలుద్దీన్

బెల్లంపల్లిరూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. శుక్రవారం రూరల్ సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాగజ్‌నగర్‌కు చెందిన పాముల పురుషోత్తంపై పాత పగలను మనస్సులో పెట్టుకొని పాముల శివసాయి, జాడి శ్యామ్‌రావులు హత్య చేయించేందుకు పథకం పన్నారు. ఇందులో భాగంగా కాగజ్‌నగర్‌కు చెందిన రమేష్, బల్లార్షకు చెందిన మహేష్‌సురేష్ సముద్రాల, ప్రదీప్ ఋషికేష్‌కుమార్‌లకు రూ.50 వేలు సుఫారీ ఇచ్చారు. రమేష్, మహేష్ సురేష్ సముద్రాల, ప్రదీప్ ఋషికేష్‌కుమార్‌లు ఈ నెల 24న సాయంతం కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ వద్ద పురుషోత్తం కారు (ఏపీ26ఏక్యూ2929)ను రూ.2,700 మంచిర్యాలకు వెళ్లేందుకు కిరాయి మాట్లాడుకున్నారు. బెల్లంపల్లి శ్రీనిధి హోమ్స్ వద్ద ఒకరు దిగుతానని చెప్పగా హనుమాన్ విగ్రహం వద్ద యూటర్న్ తీసుకుని వెళుతుండగా మూత్ర విసర్జన కోసం కారు ఆపమన్నారు. పురుషోత్తం కిందకు దిగడంతో బండరాళ్లతో అతడి తల, కాళ్లపై కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయాడు. చనిపోయాడని అనుకున్న నిందితులు అతని వద్ద ఉన్న రూ.3,500 నగదు, సెల్‌ఫోన్, కారును తీసుకుని కాగజ్‌నగర్ వైపు వెళ్లారు. బాధితుడు పాముల పురుషోత్తం కొడుకు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు. శుక్రవారం తాండూర్ మండలం మాదారం 3 ఇంక్లైన్‌కు వెళ్లే అటవీమార్గంలో నిందితులు ఉన్నారనే సమాచారం మేరకు వారిని పట్టుకున్నామని ఐదుగురిని రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుల నుంచి కారు, 6 సెల్‌ఫోన్‌లు, రూ. 5 వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్‌ఐలు రమేష్, మహేందర్, ప్రసాద్‌లు పాల్గొన్నారు. నిందితులను పట్టుకున్న సీఐ, ఎస్‌ఐలను డీసీపీ, ఏసీపీలు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కాసిపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నేషనల్‌హైవే సోమగూడెం వైజంక్షన్ మధురహోటల్ సమీపంలో శుక్రవారం సాయంత్రం కారు,వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్నఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. మంచిర్యాల నుంచి వస్తున్న కారును తాండూర్ వైపు నుంచి వేగంగావచ్చిన మినీవ్యాన్ ఢీకొట్టింది. కారులోని బెలూన్‌లు తెరుచుకోవడంతో అందులో ఉన్న బెల్లంపల్లికి చెందిన నితీష్, సందీప్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. గమనించిన స్థానికులు గాయాలపాలైన వారిని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఎవరు ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.



గుర్తింపు సంఘం హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

మందమర్రి టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గుర్తింపు సంఘం హామీలను నెరవేర్చాలని సీఐటీయూబ్రాంచికార్యదర్శి ఎస్ వెంకటస్వామి, అల్లి రాజేందర్ పేర్కొన్నారు. ఏరియాలోని కేకే ఓసీపై శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో వారుమాట్లాడారు. కొన్నినెలల క్రితం గుర్తింపు పత్రం తీసుకున్నటువంటి ఏఐటీయూసీ కార్మికుల హామీల అమలుకు సంబంధించి ఇంతవరకు ప్రస్తావించ కపోవడం దారుణమన్నారు. తమ యూనియన్ మాత్రం కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలని, ఇన్‌కమ్ టాక్స్ రద్దుచేయాలని సంతకాలసేకరణ చేపట్టిందన్నారు. ఈ సంతకాలను లేఖలరూపంలో ముఖ్యమంత్రికి పంపిస్తామన్నారు. త్వరలో పెద్దఎత్తున ధర్నాలు చేపడతామన్నారు. తాము చేపడుతున్న ఈ కార్యక్రమానికి కార్మికవర్గం నుంచి కూడా మంచి స్పందన ఉందన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

కన్నీళ్లు మిగిల్చిన సాగు..



- అన్నదాతకు కలిసి రాని కాలం..
- ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన రైతులు
- తగ్గిన పంట దిగుబడులు
- అకాల వర్షాలతో వేలాది ఎకరాల్లో పంట నష్టం
- కూలీల కొరతతో ఇబ్బందిపడ్డ రైతులు
- అందరికీ వర్తించని రుణమాఫీ.. ఊసేలేని రైతు భరోసా



అధిక వర్షాలకు నీట మునిగిన పత్తి పంట(ఫైల్)

ఆసిఫాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించే రైతన్నకు ఏటేటా కష్టాలు తప్పడం లేదు. ప్రకృతి వైపరిత్యాలకు రైతులు విలవిలలాడుతున్నారు. అతివృష్టి, అనావృష్టి.. ఏటా ఏదో ఒక రూపంలో జిల్లా రైతాంగం అతలాకుతలమవుతోంది. ఏటేటా పంట సాగు ఖర్చులు పెరుగడం, గిట్టుబాటు ధర లభించక పోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. దీంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. ఈ ఏడాది వానాకాలం ప్రారంభంలో సమయానికి వర్షాలు కురియక మొదటిసారి విత్తిన విత్తనాలు కుళ్లిపోగా రెండోసారి విత్తనాలు నాటారు. అనంతరం జూలై చివరి వారం నుంచి ఏకధాటిగా వర్షాలు కురుస్తూనే ఉండటంతో వేసిన పంటలు ఎదుగుదల లేక రైతులు దిగాలు చెందారు. జిల్లాలో కురిసిన భారీవర్షాల కారణంగా సుమారు పదివేల ఎకరాలలో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. జిల్లాలోని 15మండలాల్లో అధికశాతం రైతులు వర్షాధార పంటలపైనే ఆధార పడుతుండగా, జూలై, ఆగస్టులో అధికంగా వర్షాలు కురియడంతో పత్తి ఎదుగుదల తీవ్రంగా తగ్గింది. అక్టోబరు, నవంబరులో చేతికి రావాల్సిన పత్తి పంట పూత, కాయలు తక్కువగా ఉండడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడింది.

జిల్లాలో సాగైన పంటలు..

ఆసిఫాబాద్ జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 4.60లక్షల ఎకరాల్లో, యాసంగి సీజన్‌లో 43,884 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో వానాకాలం సీజన్‌లో 3.50లక్షల ఎకరాల్లో పత్తి, 59వేల ఎకరాల్లో వరి, 38వేల ఎకరాలలో కంది, 680ఎకరాలలో జొన్న, 1700ఎకరాలలో పెసర, 742 ఎకరాలలో మొక్క జొన్న, సోయాబీన్ 6089ఎకరాలు, మిరప 3173ఎక రాలు, వేరుశనగ 178 ఎకరాలు, ఆముదాలు 10ఎకరాలు, నువ్వులు 10ఎకరాల్లో రైతులు సాగు చేశారు. అలాగే యాసంగి సీజన్‌లో వరి పంట 21,415 ఎకరాలు, పెసర 1530ఎకరాలు, జొన్న 10,202, మొక్కజొన్న 2,560 ఎకరాలు,,గోదుమలు 1044 ఎకరాలు, శెనగ 6516 ఎకరాలు ఇతర పంటలు 617 ఎకరాలలో సాగు అవుతున్నాయి.

నష్టపోతున్నరైతాంగం..

సాగు చేస్తున్న పంటలు ప్రకృతివైపరిత్యాలు, తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గి రైతులు నష్ట పోతున్నారు. జిల్లాలో ఏటా అతివృష్టితో రైతాంగం తీవ్రంగా నష్ట పోతున్నారు. జిల్లాలో ఈ ఏడాది జూలై,ఆగస్టు మాసా ల్లో కురిసిన అధిక వర్షాలకు 10వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో ఇసుక మేటలు ఏర్పడి రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షాలు కురవడంతో ఏరివేతకు సిద్ధంగా ఉన్న పత్తి పంట తడిసి పోగా.. ఆరబెట్టిన వరిధాన్యం తడిసి ముద్దయ్యాయి. కంది పంట పూత రాలిపోయింది. అయినప్పటికీ ప్రభుత్వాలు రైతులను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఆశించిన స్థాయిలో దిగుబడి రాక ఒక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు.

కూలీలకు డిమాండ్..

జిల్లా రైతాంగాన్ని ప్రతిఏటా కూలీల కొరత వేధిస్తోంది. పత్తి చేలలో కలుపుతీత, పత్తి ఏరివేత పనులు నిర్వహించేందుకు కూలీలకు చాలా డిమాండ్ ఉంది. గ్రామాల్లో కూలీలు దొరకకపోవడంతో రైతులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. కలుపుతీత పనులకు రూ.300నుంచి రూ.500వరకు కూలీ చెల్లించినా దొరక డంలేదు. ఇక పత్తి ఏరివేతకు కిలోకు రూ.10 నుంచి 12చెల్లిస్తున్నారు. ఇక్కడ కూలీలు దొరకకపోవడంతో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ కూలీలను తీసుకువచ్చి వారికి అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. దీనికితోడు జిల్లాలో నవంబరు 29న కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ గ్రామంలో పత్తి చేనులో పత్తి ఏరుతున్న మహిళా కూలీ లక్ష్మి(22) పై పులి దాడి చేసి హతమార్చింది. అలాగే నవం బరు 30న సిర్పూర్(టి) మండలంలోని దుబ్బగూడ గ్రామంలో పత్తి చేనులో పత్తి ఏరుతున్న రైతుపై దాడి చేసి గాయపరిచింది. దీంతో పత్తి ఏరేందుకు కూలీలు వెళ్లడానికి జంకుతున్నారు. కూలీలు దొరకక పోవడంతో చేతికి వచ్చిన పత్తి పంట అలాగే ఉండిపోతోంది. దీంతో రైతులు కూలీలు దొర కక పంటలు చేతికి అందక ఇబ్బందులకు గురవుతున్నారు.

కొందరికే రుణమాఫీ.. ఊసేలేని రైతు భరోసా..

ఎన్నికలకు ముందు రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. జిల్లాలోని 15మండలాల్లో 1.19లక్షల మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. జిల్లాలో మూ డు విడతల్లో 51,523 మంది రైతుల ఖాతాల్లో రూ.465.84 కోట్లు జమయ్యాయి. ఇందులో కొంతమంది అర్హులున్నప్పటికీ రుణమాఫీ జరగలేదు. దీంతో రుణ మాఫీ కాని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి సాయం కింద రైతుబంధు పథకం కింద ఎకరానికి రూ.5వేల చొప్పున వానాకాలం, యాసంగి సీజన్‌లలో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేసేది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రైతుభ రోస పథకం ద్వారా ఎకరానికి రూ. 7500 చొప్పున రెండు విడతల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఈ ఏడాది వానాకాలం, యాసంగి సీజన్‌లో రైతుల ఖాతాల్లో రైతుభరోస కింద ఒక్క రూపాయి కూడా జమ కాలేదు. దీంతో రైతాంగాం పెట్టుబడి కోసం బయట అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల ముందు పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామిని అమలు చేయకపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు.

మన్మోహన్‌సింగ్ మరణం పార్టీకి తీరని లోటు







మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లిలో మన్మోహన్ సింగ్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గర్మిళ్ల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖప్రేంసాగర్‌రావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమెమాట్లాడుతూ ప్రధానిగా మన్మోహన్‌సింగ్ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని పేర్కొన్నారు. ఆయనచేసిన సేవలు మర్చిపోలేనివన్నారు. రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ చైర్మన్ కోట్నాక తిరుపతి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు హాలులో కాంగ్రెస్ పార్టీ సేవాదల్ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కేంద్ర ఆర్థిక మంత్రిగా, దేశప్రధానిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎల్లయ్య, కనకరాజు, రాజయ్య, తఇరుపతి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: భారతదేశం ఒకగొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందని మాజీఎంపీటీసీ మంతెన లక్ష్మణ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు చల్ల విశ్వంభర్‌రెడ్డి, అంబల్ల రవీందర్‌రెడ్డి, శీలం వెంకటేశం, పండగ రాజన్న,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: మన్మోహన్‌సింగ్ మృతి బాధాకరమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ప్రధానిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. పట్టణాధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, టీపీసీసీ ప్రచార కన్వీనర్ నాతరి స్వామి, టీపీసీసీ మెంబర్ చిలుముల శంకర్, ఎంఆర్‌పీఎస్ నాయకులు మల్లారపు చిన్నరాజం, గెల్లి జయరాం, అఫ్జల్, నయీం తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్: దేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశంతో పాటు కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని విలేకరులకు పంపిన ఒక ప్రకటనలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థను అదుపులోకి తీసుకువచ్చిన గొప్పఆర్థికవేత్త అని కొనియాడారు. పదిసంవత్సరాలు ప్రధానిగా పని చేసిన ఆయన ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. అదే విధంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు వంశీకృష్ణ కూడా మన్మోహన్ సింగ్ మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆయన చిత్రపటానికి పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సొత్కు సుదర్శన్, పీఏసీఎస్ చైర్మన్‌ప్రభాకర్ పూలమాలవేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్న తరుణంలో సంస్కరణలను ప్రవేశపెట్టి అభివృద్ధి చేసిన మేధావి అని కొనియాడారు. పట్టణంలో దివ్యాంగులసంఘం ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్‌కు చిత్రపటానికి పెద్దపల్లి సత్యనారాయణ నివాళులర్పించారు. పాత వీరస్వామి, ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్‌లు పాల్గొన్నారు. దేశ మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి చింతిస్తూ కేకే5గనిపై కార్మికసంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఐఎన్టీయూసీ కేంద్రకమిటీ చీఫ్ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంశెట్టి నరేందర్ పాల్గొన్నారు.

కాసిపేట: దేశ మాజీప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి సిద్దం తిరుపతి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

నెన్నెల: డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి పట్ల మండల కాంగ్రెస్ నాయకులు సంతాపం ప్రకటించారు. మండల కేంద్రంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెన్నోజు శంకరయ్య, తోట శ్రీనివాస్, గట్టు బానేష్, తోడె బాపురెడ్డి, తిరుపతిరెడ్డి, శివలింగయ్య, కంపెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ అన్నారు. జన్నారంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వాణిజ్య సంస్థలు మూసివేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్‌నాయకులు మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముజాఫర్ ఆలీ, పసివుల్లా, మాణిక్యం, రాజశేఖర్, సుభాష్‌రెడ్డి, శంకరయ్య, ఇందయ్య, లక్ష్మీనారాయణ, సుధాకర్ నాయక్,ఇబ్రహీం, ముజ్జు, కార్తీక్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం తీరనిలోటని కాంగ్రెస్‌నాయకులు పేర్కొన్నారు. సారంగపల్లిలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గందె రాంచందర్, ఒడ్నాల కొమురయ్య, కమల్ మనోహర్‌రావు, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ రూరల్: మాజీప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి శుక్రవారం ఆసిఫాబాద్ పట్టణంలో కాంగ్రెస్‌నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రఫీక్, అసద్, గుండాశ్యాం, ఆసీఫ్, మల్లన్న, దత్తు, శ్రీనివాస్, వినోద్, కలీం తదితరులు పాల్గొన్నారు. విశ్రాంతఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్ర మంలో విశ్రాంతఉద్యగులు కరుణాగౌడ్, రమేష్, సిరాజ్, వినోద్, వెంకటేష్, పోచన్న తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితీరని లోటని బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహోల్‌కార్ అశోక్, కాంగ్రెస్‌పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణక్క పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జైతావన్ బుద్ధ విహార్‌లో బీఎస్‌ఐ నాయకులు, కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆపార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వేర్వేరుగా నివాళులర్పించారు. ఆయాకార్యక్రమాల్లో అంబేడ్కర్ సంఘం నాయకులు విలాస్, దుర్గం శ్యాంరావు, హంసరాజ్, రోషన్, ప్రతాప్, రమేస్, కిరణ్, జైపాల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు తన నివాసంలో మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ దండెవిఠల్ ఆయన నివాసంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే విశ్రాంత ఉద్యోగుల సంఘభవనంలో విశ్రాంత ఉద్యోగులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరుణ్‌లోయ, శ్రీనివాస్, బాల్కశ్యాం, మురళీధర్ రావు, శంకర్, సత్యనారాయణ, శివ, నారాయణ, సంతోష్, గణపతి, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: మాజీప్రధాని మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు లావుడ్య రమేష్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గం దేవాజీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాజీ ప్రధానిమృతికి సంతాపకంగా నివాళులర్పించారు.



కలెక్టరేట్ : మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



మందమర్రిటౌన్: కేకే 5 గనిపై నివాళులర్పిస్తున్న కార్మికులు



వాంకిడిలో నివాళులు అర్పిస్తున్న బీఎస్‌ఐ నాయకులు

బెజ్జూరు: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, లింగయ్య, సురేష్‌గౌడ్, సత్యనారాయణ, జలపతి తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కాగజ్‌నగర్‌లో నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్



రియల్.. ఢమాల్

● దయనీయ పరిస్థితుల్లో వ్యాపారులు
● పూర్తిగా మందగించిన ప్లాట్ల అమ్మకాలు
● చతికిలపడ్డ నాన్ లే అవుట్ వెంచర్లు

జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించింది. భూముల క్రయవిక్రయాలు తగ్గిపోయాయి. వేసిన లేఅవుట్లలో ప్లాట్లు అమ్ముకోవడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు నానా పాట్లు పడుతున్నారు. కొంత మంది రియల్టర్లు పెట్టుబడి కోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక అవస్థలు పడుతున్నారు.



మంచిర్యాల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. ఆ రంగంపై ఆధారపడ్డ వ్యాపారులు, మధ్యవర్తుల పరిస్థితి దయనీయంగా మారింది. వెంచర్లు ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు అప్పులు చేసి స్థలాలు కొనుగోలు చేసినప్పటికీ, సబ్ డివిజన్ల రిజిస్ట్రేషన్లు జరుగక పోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ముందుకు రాకపోవడంతో చేసిన అప్పుల వడ్డీలు తీర్చేందుకు కొత్త అప్పులు చేస్తూ అప్పుల ఊబిలో మునిగిపోయారు. ముఖ్యంగా నాన్ లే అవుట్ వెంచర్లు ఏర్పాటు చేసిన వ్యాపారుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. రియల్ ఎస్టేట్ రంగం చతికిల పడటంతో దాని ప్రభావం ఇతర వ్యాపారాలపై పడింది. రియల్ ఎస్టేట్ రంగం వెలవెలబోవడంతో వాహనాల షోరూంలు, భవన నిర్మాణ రంగం, వస్త్ర, జువెల్లరీ, తదితర రంగాలపైనా దాని ప్రభావం పడింది.

అసెంబ్లీ ఎన్నికలతో మొదలు..

అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కోడ్ ఎత్తివేసినా రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంచుకోవడం లేదు. భూముల క్రయ, విక్రయాలు పూర్తిగా నిలిచిపోగా, వినియోగదారులు లేక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు వెలవెల బోతున్నాయి. ఎన్నికలకోడ్ రాకముందు నిత్యం సగటున వంద వరకు రిజిస్ట్రేషన్లు జరుగగా కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత వాటి సంఖ్య సగానికి పడిపోయింది. రిజిస్ట్రేషన్ల సమయంలో భూముల క్రయ, విక్రయాలకు సంబంధించి పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం కాగా, కోడ్ కారణం గా వాటిని తీసుకెళ్లడం కష్టసాధ్యంగా మారింది. నగదు తరలించే సమయంలో పోలీసులకు దొరికితే డబ్బంతా సీజ్ అయ్యే అవకాశం ఉండడంతో స్థిరాస్తి వ్యాపారులు భూముల క్రయ, విక్రయాల జోలికి వెళ్లలేదు. ఎన్నికల ప్రక్రియ ముగిసి పరిస్థితులు అనుకూలంగా మారినప్పటికీ బిజినెస్ ఊపందుకోలేదు.

నిలిచిన నిర్మాణాలు..

భూముల అమ్మకాలు నిలిచిపోవడంతో ఇప్పుడు భవన నిర్మాణాలు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో సింహభాగం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజకీయ నాయకులతో సంబంధాలు కలిగి ఉన్నారు. నగదు చలామణిపై ఆధారపడి ఉన్న రియల్‌ఎస్టేట్ బిజినెస్ పూర్తిగా మందగించింది. సాధారణంగా యేటా నవంబరు నుంచి జూన్ మధ్యకాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపు మీద ఉంటుంది. అయితే గత ఏడాది నవంబరు 30న ఎన్నికలు జరగడంతో దాదాపుగా రెండునెలల ముందు, ఆ తరువాత మరో రెండు నెలలపాటు రియల్ ఎస్టేట్ రంగంపై దాని ప్రభావం పడింది. అలా గత సంవత్సరం రియల్ ఎస్టేట్ రంగం స్తంభించింది. ఈ ఏడాదైనా వ్యాపారం పుంజుకుంటుందని ఆశించిన వ్యాపారులకు మళ్లీ గడ్డు పరిస్థితులే ఎదురయ్యాయి. లే అవుట్‌లేని వెంచర్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జరుగక రియల్ ఎస్టేట్ రంగం పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. రెండు, మూడు ఎకరాల తక్కువ విస్తీర్ణంలో వెంచర్లు ఏర్పాటు చేసే వ్యాపారులు లే అవుట్‌కు వెళ్లేందుకు పరిస్థితులు అనుకూలించవు. లే అవుట్‌కు వెళితే 10 శాతం భూమి స్థానిక సంస్థల పేరిట రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉంటుంది. తక్కువ విస్తీర్ణం కావడం, అందులోని కొంత భూమి గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పేరిట మార్చాల్సి వస్తోంది. దీంతో వచ్చే లాభాలు కాస్త ఆ భూమి రూపంలో కోల్పోవలసి వస్తుంది. వ్యాపారులు లేఅవుట్ లేకుండానే వెంచర్లు ఏర్పాటు చేసి, పరిచయం ఉన్న వారితో ప్లాట్లు కొనుగోలు చేయిస్తుంటారు. ప్రస్తుతం లే అవుట్ లేని వెంచర్లలోని ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో చిన్న వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది.

తగ్గిన రిజిస్ట్రేషన్లు..



మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రియల్ వ్యాపారం కుదేలవడంతో రిజిస్ట్రేషన్లు తగ్గి ప్రభుత్వ ఆదాయంపై ప్రభావం చూపుతోంది. సగటున నిత్యం 80 డాక్యుమెంట్ల వరకు రాగా, కోడ్ అమలులో ఉన్న సమయంలో వాటి సంఖ్య సగానికి పడిపోయింది. అక్టోబరులో కోడ్ రాక ముందు వారం రోజుల్లో రూ. కోటి 4 లక్షలపై చిలుకు ఆదాయం సమకూరింది. కాగా కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత రూ.67 లక్షలకు పడిపోయింది. ఎన్నికల ప్రక్రియ ముగిసి ఏడాది కావస్తున్నా పరిస్థితిలో ఏ మాత్రం మార్పు కానరావడం లేదు.

ప్రభుత్వం అవకాశం ఇవ్వాలి..



తక్కువ విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న వెంచర్ల ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం అవకాశం ఇవ్వాలి. రిజిస్ట్రేషన్లు జరుగగా చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. చేసిన అప్పులుతీర్చే మార్గం కానరావడం లేదు. రియ ల్ ఎస్టేట్ రంగంపై ఆధారపడ్డ వందలాది మంది రోడ్డు న పడాల్సి వస్తుంది. ప్రభుత్వం సానుకూల దృక్పథంతో సింగిల్ విండో పద్ధతిలో రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలి.

- పూదెం వెంకటస్వామి, రియల్ ఎస్టేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

క్రమబద్ధీకరణ కోసం..



నాన్ లే అవుట్ వెంచర్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఇప్పటికే చాలా మంది ఎల్ఆర్ఎస్ చేయించి ఉన్నారు. 2020 ఆగస్టులో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పేరు తో నాన్ లే అవుట్ వెంచర్ల ప్లాట్లకు రిజిస్ట్రేషన్లకు అవ కాశం కల్పించింది. ఇందులో భాగంగా ప్లాట్‌కు రూ.1000, వెంచర్‌కు రూ.10 వేల చొప్పున ఫీజు వసూ లు చేసింది. అయినా ఆ దిశగా కార్యాచరణ జరుగ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా నాన్ లే అవుట్ వెంచర్ల లోని పాత ప్లాట్లకు రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలి.

- నీలి శ్రీనివాస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు

5వ పేజీ తరువాయి..



బెల్లంపల్లిలో మంచి నీటి సరఫరా పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వినోద్ (ఫైల్)

చేయడంతో పనులు వేగం పుంజుకున్నాయి. ఇంతకాలం ఓ వ్యాపారి నిర్మించిన శ్మశాన వాటికపై ఆధారపడుతుండగా, వర్షాకాలంలో గోదావరిలోకి నీళ్లు చేరినప్పుడల్లా అది ముంపునకు గురవుతోంది. దీంతో అంత్యక్రియలకు ప్రజలు అష్టకష్టాలు పడాల్సి వచ్చేది.

మున్సిపల్ కార్పొరేషన్‌కు లైన్ క్లియర్...

మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చేం దుకు లైన్‌క్లియర్ అయింది. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. మంచిర్యాల పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతోపా టు ప్రధాన రైల్వే మార్గం అందుబాటులో ఉండటంతో వేగంగా అభివృద్ధి సాధించింది. 1956లో మంచిర్యాల మున్సిపాలిటీగా ఏర్పాటు కాగా, అప్పటి నుంచి అంచె లంచెలుగా అభివృద్ధి చెందింది. మంచిర్యాల చుట్టు పక్కల బొగ్గు బావులు, సిరామిక్ ఇండస్ట్రీలతోపాటు, విద్యుత్ పరిశ్రమలు ఉన్నాయి. నూతనంగా ఏర్పడ్డ నస్పూర్ మున్సిపాలిటీతోపాటు హాజీపూర్ మండలం లోని ఆరు గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు జరుగు తున్నాయి.

బెల్లంపల్లి వాసులకు తాగునీరు....

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక కృషితో నియోజకవర్గ ప్రజల దాహం తీర్చేందుకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. ఆసిఫాబాద్ జిల్లాలోని అడహక్ ప్రాజెక్టు నుంచి నీరు అందుతుండగా, ప్రస్తుతం హాజీ పూర్ మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పూర్తి స్థాయిలో నీరు ఇవ్వనున్నారు. రూ.62కోట్ల అంచనా వ్యయంతో ప్రత్యేకంగా రిజర్వాయర్లు, పైపులైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులకు ఇప్పటికే పరిపాలనా అనుమతులు లభించగా పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. బుగ్గ రాజరాజేశ్వరస్వామి ఆలయం రోడ్డుకు సైతం మోక్షం లభించింది. అటవీ అనుమతులు లేక రహదారి నిర్మాణానికి అడ్డంకులు ఉండేవి. ఎమ్మెల్యే గడ్డం వినోద్ కృషితో ఇటీవల అటవీ అనుమతులు రావడంతో మార్గం సుగమమైంది. రూ.2 కోట్ల అంచనా వ్యయంతో అమృత్ 2.0 పథకంలో గ్రామం నుంచి ఆలయం వరకు రహదారి నిర్మాణానికి ఇటీవల ఎమ్మెల్యే శంకుస్థాపన చేయగా పనులు ప్రారంభమయ్యాయి.

రూ. 500 కోట్లతో చెన్నూరు అభివృద్ధి

చెన్నూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గడ్డం వివేకా నంద ప్రత్యేక చొరవతో రూ.500 కోట్లతో వివిధ అభి వృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, తదితర పనులు ఉన్నాయి. నిరుద్యోగ యువతకు చేయూతగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మందమర్రి పట్ట ణంలో లెదర్ పార్క్ పునఃప్రారంభానికి మార్గం సుగ మమైంది. ఇందులో భాగంగా రూ.20 లక్షలు ఇప్పటికే మంజూరు కాగా త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నారు. భీమారంలోని జోడు వాగులపై రహదారి నిర్మాణానికి రూ.100 కోట్లను ఎమ్మెల్యే మంజూరు చేయించారు. జోడువాగుల బ్రిడ్జి మరమ్మతు కోసం రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. క్యాతన్‌పల్లిలో దశాబ్దాలుగా పెండింగులో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. నియోజక వర్గంలో తాగునీటి ఏర్పాటుకు రూ. 100 కోట్లతో అమృత్ వాటర్ స్కీంను ప్రారంభించనున్నారు. చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. నక్కల వాగు బ్రిడ్జి నిర్మాణానికి రూ.13 లక్షలు నిధులు మంజూరయ్యాయి.

నిత్యావసర సరుకుల పంపిణీ

కాసిపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్‌లోని అచ్యుతరావు గూడెంకు చెందిన ఆత్రం సత్తుబాయి ఇల్లు ప్రమాదవశాత్తూ గురువారం రాత్రి కాలిపోయింది. సత్తుబాయి కుటుంబానికి శుక్రవారం తహసీల్దార్ భోజన్న నిత్యావసర సరుకులతో పాటు నగదును అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో ఇల్లుతోపాటు సర్వం కోల్పోయిన సత్తుబాయి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. ఇల్లు కాలిపోయిన సత్తుబాయిని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం సరుకులు అందించారు. మాజీ జెడ్పీటీసీ రౌతు సత్తయ్య, శంకర్, మైదం రమేష్, రాజమొగిలి, రాంచందర్, శ్రీనివాస్, జనార్ధన్, కిష్టయ్య, రాజమౌళి, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

అమృత కలశం అందజేత

దండేపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దండేపల్లిలో నిరుపేద కుటుంబానికి చెందిన పెండ్యాల లావణ్య కుటుంబానికి సత్యసాయిభజన మండలి ఆధ్వర్యంలో శుక్రవారం అమృత కలశం అందజేశారు. జగిత్యాలకు చెందిన మూడపల్లి వినాయక్ శైలజ దంపతుల కుమారుడు నిహాల్ జన్మదినం సందర్భంగా రూ 1500 విలువ గల సరుకులతో కూడిన అమృత కలశాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాపర్తి రాజన్న, పసుపునూటి సాయిరాం, కుమారస్వామిగౌడ్, గడికందుల లచ్చన్న, రామగిరి ప్రేమ్‌సాగర్, దుర్గం గురువయ్య, శ్రీనివాస్‌గౌడ్, సత్యంగౌడ్, పాల్గొన్నారు.

రజక మహాసభ పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న రజక రిజర్వేషన్ సమితి నాయకులు

గర్మిళ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జనగామలో ఈ నెల 29న జరిగే తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర 3వ మహాసభల పోస్టర్లను శుక్రవారం సమితి నాయకులు మంచిర్యాలలోని గౌతమినగర్‌లో విడుదల చేశారు. జిల్లా అధ్యక్షుడు సంగం లక్ష్మణ్ మాట్లాడుతూ మహాసభలో రజకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు సంగెపు ఎల్లన్న, తిరుపతి, శంకర్, శ్రీనివాస్, రాయమల్లు, శంకర్, సత్తయ్య, కొమురయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



మాట్లాడుతున్న ఎస్ఐ శ్వేత

భీమారం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, నేరాలను నియంత్రించవచ్చని ఎస్ఐ శ్వేత పేర్కొన్నారు. శుక్రవారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా బస్టాండ్ ప్రాంతంలో వ్యాపారులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరించారు. ప్రతీ గ్రామంలో, దుకాణాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే ఏదైనా ఆపద వస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

అఖిల భారత ప్రధాన్ ఉత్తన్ సంఘటన్ కార్యవర్గం

జన్నారం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత ప్రధాన్ ఉత్తన్ సంఘటన్ మండల కమిటీని శుక్రవారం జన్నారంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కుర్సెంగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పర్చెకి వెంకటరమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు సుధాకర్, మోహన్‌రావు, కౌసల్య, మన్మోహన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ



గూడెంలో పడిపూజలో అయ్యప్ప స్వామికి అభిషేకం చేస్తున్న గురుస్వామి

దండేపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గూడెం అయ్యప్ప ఆలయంలో శుక్రవారం అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి మహామండల పడిపూజ నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాతసేవ, పంచామృత అభిషేకం, లక్ష్మీగణపతి హోమం గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై మహా మండల పడిపూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా మండల పడిపూజ సందర్భంగా దివ్యపదునెట్టంబడి పద్దెమ్మిది మెట్లపై దీపాలను వెలిగించి ప్రత్యేకపూ జలు చేశారు. స్వామి వారికి దీక్షపరులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామి తీర్థ ప్రసాదలతో పాటు అన్నదానం కార్యక్రమంను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అయ్యప్పదీక్షపరులు, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష

గర్మిళ్ల, (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ దంపతుల ఆధ్వర్యంలో పట్టణంలోని బైపాస్‌రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద స్వాములకు, భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ల విడుదల



మహాసభల పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

భీమారం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం జాతీయ 2వ మహాసభ పోస్టర్లను శుక్రవారం భీమారంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జనవరి 5, 6, 7 తేదీల్లో హైద్రాబాద్‌లో జరిగే సభల్లో నాయకులు, దళితులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం దేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి నివాళులర్పించారు. నాయకులు ఆవిడపు రమేష్, మొగిలి లక్ష్మణ్, చింతల శ్రీనివాస్, రాములు, బాపు, చంద్రయ్య, శంకర్, మారుతి, బాబర్‌ఖాన్, రూప్‌సింగ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాం పాలన నుంచి స్వరాష్ట్ర సాధన వరకు సినిమా తీస్తా

సినిమా డైరెక్టర్ ఎన్. శంకర్



నల్లాల ఓదెలు నివాసంలో మాట్లాడుతున్న సినిమా డైరెక్టర్ శంకర్

మందమర్రిటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిజాం పాలన నుంచి మొదలుకుని తెలంగాణ స్వరాష్ట్ర సాధన వరకు జరిగిన అంశాల ఇతివృత్తంగా త్వరలో సినిమా తీస్తానని డైరెక్టర్ ఎన్. శంకర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని గఫూర్ నివాసంలోని పీరీలను ఆయన దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కవులు, కళాకారులు, రచయితలు ఉద్యమాన్ని తారాస్థాయికి తీసుకువెళ్లారన్నారు. కళాకారులకు బీఆర్ఎస్ పాలనలో కొంత అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ పాలనలో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. తెలంగాణ ధూం దాం వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజుకు కాంగ్రెస్ పాలనలో పదవి వస్తుందని ఆశిస్తున్నానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కోసం విద్యార్థుల ఆత్మబలిదానాలు పోరాటాలు తారాస్థాయికి చేరుకున్న సందర్భంలో జైబోలో తెలంగాణ షూటింగ్ సందర్భంగా ఇక్కడ పీరీల వద్దకు వచ్చి మొక్కుకున్నానని తెలిపారు. సింగరేణిలో కూడా సినిమా షూటింగ్‌లకు అవసరమైన ప్రదేశాలు ఉన్నాయని తెలిపారు. కళాకారులు డైరెక్టర్ శంకర్‌ను సన్మానించారు. అనంతరం మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు నివాసంలో తేనేటి విందును స్వీకరించారు. సొత్కు సుదర్శన్, కళాకారులు ఎగ్గేటి రాజేశ్వర్‌రావు, ప్రభాకర్, ఉప్పులేటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

-చట్టానికి ఎవరూ అతీతులు కారు

చట్టానికి ఎవరు అతీతులు కారని, తన పని తాను చేసుకుపోతుందని డైరెక్టర్ శంకర్ తెలిపారు. హీరో అల్లు అర్జున్ అరెస్టుకు సంబంధించిన విషయంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. చట్టం ముందు అందరు సమానులేనని తెలిపారు.

వాయిస్ రికార్డింగ్‌లతో
వీధి వ్యాపారం...

● సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్న చిరు వ్యాపారులు

నస్పూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులు సాంకేతిక వ్యాపారం నిర్వహిస్తూ వీధి వ్యాపారం చేస్తున్నారు. ఒకప్పుడు వ్యాపారులు వారి వద్ద ఉన్న సరకులను విక్రయించేందుకు బిగ్గరగా అరిచేవారు. నేడు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో రకరకాల సౌండ్‌లు జనాలకు ఇబ్బంది కలిగిస్తున్నప్పటికి చిరు వ్యాపారులు వాటినే వినియోగిస్తున్నారు.

ఉదయం లేవక ముందే ముగ్గమ్మ ముగ్గో రాయి ముగ్గు... కొబ్బరి కుడుకలకు చక్కర... గ్యాస్ స్టవ్‌లు రిపేర్ చేయబడును... మీ పిల్లల స్కూల్ బ్యాగులకు, ప్యాంటులకు కొత్త జిప్పులు వేయబడును.. వంద రూపాయలకు రెండు కిలోల ఎల్లిగడ్డలు, అల్లం... పాత పేపర్లను కొంటాం... అంటూ వీధుల్లోకి తెల్లవారక ముందే ఇలాంటి రికార్డింగ్ సౌండ్ వాయిస్‌లతో చిరు వ్యాపారులు తోపుడు బండ్లు, ద్విచక్ర వాహనాలు, ఆటో ట్రాలీలపై వచ్చి చక్కర్లు కొడుతుంటారు...

సెల్‌ఫోన్.. బ్లూటూత్ సాయంతో...

రకరకాల సరకుల పేర్లతో కూడిన వాయిస్ రికార్డింగ్‌ను వ్యాపారులు వాహనాలకు మైక్‌లను కట్టుకుని, మరి కొందరు చేతిలో చిన్న హ్యాండ్ మైక్ పట్టుకుని చక్కర్లు కొడుతుంటారు. నేడు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో పరిస్థితులు మారిపోయాయి. ఆయా సరకుల పేర్లతో కూడిన రికార్డింగ్ వాయిస్‌లు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. దీని కొరకు రూ. రెండు వందల నుంచి మూడు వందల వరకు ఖర్చు చేస్తున్నారు. వ్యాపారానికి అవసరమైన వాయిస్ రికార్డింగ్‌ను సెల్‌ఫోన్‌లోకి అప్‌లోడ్ చేసి ద్విచక్ర వాహనాలకు, ఆటోలకు వాయిస్ రికార్డింగ్‌ను సెల్‌ఫోన్ బ్లూటూత్ ద్వారా మైక్‌లకు అనుసంధానం చేస్తారు. ఆయా వీధుల్లోకి వెళ్లగానే సెల్‌ఫోన్ వాయిస్‌ను ఆన్ చేస్తారు. దీంతో వారి వద్ద ఉన్న సరుకుల వివరాల వాయిస్ రికార్డింగ్ రూపంలో ఆన్ అయి ఏకధాటిగా వస్తూనే ఉంటాయి. వాడలో ఎవరైనా ఆపి అడిగితే మైక్ సౌండ్ తగ్గిస్తారు... లేకపోతే వాయిస్ వీధి చివరి వరకు కూడా ఆ సౌండ్ వస్తూనే ఉంటుంది. ప్రస్తుతం కొత్త సంవత్సరం, సంక్రాంతి పండగలు వస్తున్నందున ముగ్గులు, రంగుల అమ్మకాలు చేసే చిరు వ్యాపారుల కాలనీల్లో, వాడల్లో సందడి పెరిగింది. చిరు వ్యాపారులు జీవనోపాధికి వ్యాపారం చేస్తున్నప్పటికి ఇలాంటి సౌండ్‌ల కారణంగా జనాలు కొంత ఇబ్బంది పడుతున్నారు.



ద్విచక్ర వాహనంపై ముగ్గు అమ్ముతున్న చిరు వ్యాపారి



వాడలో ప్లాస్టిక్ పూల వ్యాపారి

మహారాష్ట్ర నుంచి పులులు

- గ్రామస్థులను అప్రమత్తం చేస్తున్న అధికారులు
- ప్రాణహిత తీరం నుంచి సిర్పూరు, కాగజ్‌నగర్ అడవుల్లోకి ప్రవేశం

● వరుస దాడులతో ప్రజల్లో ఆందోళన..


పులి పాదముద్రలు

కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్‌లో గత నెల 29న పత్తి ఏరుతున్న కూలీ లక్ష్మి(22)పై దాడి చేసి చంపేసిన సంఘటన నుంచి తేరుకోక ముందే నజ్రూల్‌నగర్ క్యాంపులో మళ్లీ ఆవుపై దాడి చేసింది. గత నెల 30న పత్తి ఏరుతున్న రౌతు శంకర్‌పై దాడి చేసింది. మూడు రోజుల క్రితం కూడా సిర్పూరు(టి) చీలపెల్లిలో అటవీప్రాంతంలో ఎద్దుపై పులి దాడి చేసింది. అయితే పులులు ఎన్ని తిరుగుతున్నాయనేది స్పష్టంగా తెలియనప్పటికీ ఇవి మహారాష్ట్ర అడవుల నుంచి వస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇది పులుల సంతానోత్పత్తికి అనువైన సమయం అని అంటున్నారు. 2014లో మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్ కడంబా ప్రాంతానికి వచ్చి ఫాల్గున అనే పులి నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. 2016లో మళ్లీ మూడు పిల్లలకు జన్మనిచ్చి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చింది. దీంతో కాగజ్‌నగర్ అటవీప్రాంతం పులుల బ్రీడింగ్ కేంద్రంగా మారటంతో వాటి సంరక్షణ విషయంలో అటవీశాఖ అధికారులు సమగ్ర చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రాంతానికి పులుల రాక పెరగుతున్న నేపథ్యంలో పులుల సంరక్షణ కేంద్రంగా గుర్తించాలని అటవీశాఖ అధికారులు ఢిల్లీ టైగర్ మానిటరింగ్ సెల్ అధికారులకు నివేదికలు పంపించారు.



కాగజ్‌నగర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోకి మహారాష్ట్ర నుంచి పులులు వస్తున్నట్లు తెలుస్తోంది. సిర్పూరు అటవీప్రాంతానికి ఈ మధ్య పులుల తాకిడి పెరిగినట్లు సమాచారం. మహారాష్ట్రకు ఆనుకొని ఉన్న ప్రాణహిత నది తీరం నుంచి సిర్పూరు, కాగజ్‌నగర్ అడవుల్లోకి పులులు వస్తున్నాయి. గురువారం కూడా సిర్పూరు(టి)-మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన అమృత్‌గూడ వద్ద రహదారిపై పులి నడుచుకుంటూ వెళ్లతుండగా కొంతమంది యువకులు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. పులి సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. పీసీసీఎఫ్ సువర్ణ ఆధ్వర్యలో సీఎస్ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ పులి ఉన్నప్రాంతాన్ని సందర్శించారు. ఐదు రోజుల క్రితం కూడా పెంచికల్‌పేట అటవీప్రాంతంలో పులి సంచారం జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. దహెగాం మండలం దరోగపల్లి అటవీ ప్రాంతంలో కూడా పులి అడుగులను అటవీశాఖ అధికారులు గుర్తించారు. మహారాష్ట్ర నుంచి సిర్పూరు(టి) అటవీప్రాంతానికి వచ్చేస్తుండటంతో అటవీశాఖ అధికారులు తమవంతుగా ముందస్తుగా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పులులు సంచారంపై ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. అటవీ ప్రాంత సమీపంలో పొలాల ఉన్న రైతులు ఉదయం పూట పది తర్వాతనే గుంపులుగా వెళ్లాలని, సాయంత్రం నాలుగు గంటల లోపు ఇళ్లకు చేరుకోవాలని సూచిస్తున్నారు.

పులుల సంరక్షణకు చర్యలు..

-వినయ్ సాహు, ఎఫ్‌డీవో, కాగజ్‌నగర్

మహారాష్ట్ర నుంచి సిర్పూరు అటవీరేంజ్‌కు పులులు వస్తున్నాయి. రెండ్రోజుల క్రితం కూడా మహారాష్ట్ర నుంచి సిర్పూరు(టి) అటవీప్రాంతానికి ఓ పులి వచ్చింది. ట్రాకర్స్ ద్వారా వాటిని ట్రాకింగ్ చేస్తున్నాం. పులుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అటవీప్రాంత సమీప గ్రామాల ప్రజలకు అవగాహన పరుస్తున్నాం. పత్తి ఏరివేత చేపట్టే వారికి మాస్క్‌లను పంపిణీ చేశాం. పులిని ట్రాకింగ్ చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.

సమగ్ర శిక్షా ఉద్యోగుల వంటావార్పు


దీక్షా శిబిరం వద్ద సహపంక్తి భోజనాలు చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమగ్రశిక్షా ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం నాటికి 18వరోజుకు చేరుకోగా దీక్షాశిబిరం వద్ద వంటావార్పు చేపట్టి సహపంక్తి భోజనాలు చేశారు. అంతకుముందు భారత మాజీప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపట్ల నివాళులు అర్పించారు. దీక్షాశిబిరాన్ని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కోట్నాక విజయ్‌కుమార్, నాయకులు కోవ విజయ్, భగవంతరావు, శంకర్, భరత్‌భూషన్, ప్రవీణ్, జనార్దన్ సందర్శించి తమ మద్దతు తెలిపి మూడు వేల ఆర్థిక సహాయం అదించారు. అలాగే బీజేపీ నాయకులు వెర్రబల్లి రఘునాథరావు, కొత్తపల్లి శ్రీనివాస్, మల్లికార్జున్, బోనగిరి సతీష్‌బాబు, విశాల్, ఎమ్మెల్సీ అభ్యర్థి మధుసూదన్‌రావు, ఎస్‌జీటీ జిల్లా అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి చైతన్యలు మద్దతు తెలిపారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

ఆసిఫాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సీపీఎంరాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలనిఆపార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు దినకర్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర మహాసభను జనవరి25నుంచి28వరకు సంగారెడ్డిలో నిర్వహిస్తామన్నారు. ఈ మహాసభలకు జాతీయ, రాష్ట్రనాయకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. మహాసభలకు సీపీఎం నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాజేందర్, కార్తీక్, నిఖిల్, తిరుపతి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుందాం

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పసుల రాంమూర్తి


మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయఅధ్యక్షుడు డాక్టర్ పసుల రాంమూర్తి

పెంచికలపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అడ్డుకుందామని, అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని మాలమహానాడు జాతీయఅధ్యక్షుడు డాక్టర్ పసుల రాంమూర్తి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం కొండపల్లి గ్రామంలో జెండా మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలతో మాలలంతా ఐకమత్యంతో ఉండాలన్నారు. రాజకీయ లబ్ధికోసం కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టేందుకు అవలంభిస్తున్న తీరును మాలలంతా ఐకమత్యంతో అడ్డుకునేందుకు ముందుకు రావాలన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే రిజర్వేషన్లు కోల్పోయి విద్య, ఉద్యోగ, అవకాశాలు కోల్పోతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్రఅధ్యక్షుడు సుదీర్, పుల్లయ్య, యాదగిరి, కిష్టయ్య, పురుషోత్తం, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

నందిగూడ గ్రామాన్ని సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం నందిగూడ గ్రామాన్ని శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గం కన్వీనర్ లెండుగురే శ్యాంరావు గ్రామస్థుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయా సమస్యలపై బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్‌లో గ్రామస్థులతో మాట్లాడారు. తమ గ్రామంలోకి అటవీ శాఖ అధికారులు భూములకు రీసర్వే చేయించాలని ఒత్తిడి తెస్తున్నారని గ్రామస్థులు ఆయనకు తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన డీఎఫ్‌వోతో ఈ సమస్యపై మాట్లాడి గ్రామస్థులపై ఒత్తిడి చేయరాదని సూచించినట్లు నాయకులు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

చింతలమానేపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాసాగర్ గ్రామానికి చెందిన రైతు గుర్లె ప్రభాకర్‌కు చెందిన 40క్వింటాళ్ల పత్తి షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధం కాగా బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బాధితుడిని శుక్రవారం ఓదార్చారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు రాంప్రసాద్, సలీం, రాజు, లహను, రాజ్‌కుమార్, బండు, శేఖర్, సంజీవ్, వెంకటేష్, సంతోష్, ప్రభాకర్, భిక్షపతి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అధిక విద్యుత్ బిల్లులపై ఏఈకి ఫిర్యాదు

బెజ్జూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అధికవిద్యుత్ బల్లులు వచ్చాయని వాటిని సరిచేయాలని కోరుతూ శుక్రవారం మండలంలోని నాగులవాయి గ్రామస్థులు ఏఈ అంజన్‌కుమార్‌కు ఫిర్యాదుచేశారు. తాము నెలవారీ బిల్లులు చెల్లిస్తున్నామని, బిల్లింగ్ చేసే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అధికబిల్లులు వచ్చాయని ఆవేదన వ్యక్తంచేశారు. బిల్లులను సరిచేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏఈ ఉన్నతాధికారులకు నివేదికలు పంపి బిల్లులు సరిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు చంద్రశేఖర్, తిరుపతి, నాందేవ్, సత్తయ్య, రవి, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


విద్యార్థిని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బెజ్జూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యాలయాల్లో విద్యార్థుల మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని అందుగులగూడ గ్రామానికి చెందిన బీఈడీ విద్యార్థి తొర్రెం వెంకటలక్ష్మి మృతి చెందడంతో శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. విద్యార్థిని కుటుంబానికి రూ.10లక్షలఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంటనాయకులు రాంప్రసాద్, సలీం, రాజ్‌కుమార్, సారయ్య, తిరుపతి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెక్కు అందజేత

సిర్పూర్(టి), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని పులిదాడిలో పశువులు మృతిచెందిన రైతులకు శుక్రవారం ఎఫ్ఆర్వో ఇక్బాల్ హుస్సేన్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని శివపూర్‌కు చెందిన దండిక శ్రీనివాస్‌కు రూ.16వేలు, ఎకోన్కర్ బాపూజీకి రూ.15 వేల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీధరాచారి, ఎఫ్‌బీవో హబీబ్, తబస్సుం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

కెరమెరి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని వృద్ధులకు శుక్రవారం ఆదివాసీమిత్ర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఐఆర్ఎస్ అధికారి ప్రకాష్‌రాథోడ్ సొంత ఖర్చులతో బ్లాంకెట్స్ దుప్పట్లను పంపిణీ చేశారు. చలితీవ్రత కారణంగా వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వృద్ధులకు తన వంతు సహాయం చేశానని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వెంకటేష్, మానవ హక్కుల వేదిక సభ్యులు సుజైన్‌ఖాన్, ఫారూక్, షాదుల్లా, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆలయంలో పూజలు

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : 'మన అమ్మ మన సారె' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లాకేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆర్యవైశ్య మహిళలు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయఅర్చకుడు ఉపేందర్‌చారి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కన్నుల పండువగా అయ్యప్ప మహా పడిపూజ

- పేటతుల్లితో మార్మోగిన పెద్దవాగు ప్రాంతం


పూజలు నిర్వహిస్తున్న గురుస్వామి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దవాగు ప్రాంతంలోని అయ్యప్ప ఆలయంలో గురువారంరాత్రి అయ్యప్ప మహా పడి పూజ కన్నులపండువగా జరిగింది. పడిపూజను పురస్కరించుకొని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆదిలాబాద్‌కు చెందిన తాంత్రి శ్రీదూబె ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు నగేష్‌శర్మ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అయ్యప్ప విగ్రహానికి అభిషేకం, పదునెట్టంబడిపై ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆదిలాబాద్‌కు చెందిన ఆనంద్ భక్తబృందం, అయ్యప్పస్వాముల భక్తిగీతాలతో పెద్దవాగు పరివాహక ప్రాంతం మార్మోగింది. అయ్యప్పస్వాముల పేటతుల్లి ఆకట్టుకుంది. అనంతరం పదునెట్టంబడిపై దీపాలు వెలిగిం చారు. 18సార్లు మాలధారణ చేపట్టిన గురుస్వాములు తోటరాజబాబు, రామరావును అయ్యప్ప స్వాములు సన్మానించారు. మహాపడిపూజ కార్యక్రమానికి కెరమెరి, వాంకిడి, రెబ్బెన, పట్టణంలోని మహిళలు, భక్తులు అధికసంఖ్యలో హాజర య్యారు. కార్యక్రమంలో గురుస్వాములు నళినిమోహన్, ఖాండ్రేకిషన్, రవిందర్‌రెడ్డి, భిక్షపతిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మడావి శ్రీనివాస్, చంద్రమోహన్, ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వేణుగోపాల్, వెంకట్‌గౌడ్, బీజేపీ నాయకులు బోనగిరి సతీష్‌బాబు, ఖాండ్రే విశాల్, సభ్యులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కాగజ్‌నగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ తుంగమడుకు చెందిన రవి వారం రోజు క్రితం తన సెల్‌ఫోన్ పొగొట్టుకోగా ఈసుగాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై మహేందర్, సిబ్బంది సాంతికేతను వినియోగించుకొని పొగొట్టుకున్న సెల్‌ఫోన్ రికవరీ చేసి రవికి అప్పగించారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆసిఫాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అమలులోకి తీసుకురావాలని డిమాండ్‌చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి7న నిర్వహించే చలోహైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరావు కోరారు. శుక్రవారం మండలంలోని కొమ్ముగూడ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చలో హైదరాబాద్ కార్యక్ర మానికి పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, మహేష్, సంతోష్, సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి


రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు, నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ మాజీఎమ్మెల్యే, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతలరామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి పార్టీ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం అంతా కృషిచేయాలన్నారు. అనంతరం రామచంద్రారెడ్డిని నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీజిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు అరిగెల మల్లికార్జున్ యాదవ్, కొట్నాక విజయ్‌కుమార్, అరుణ్‌కుమార్, కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

కాగజ్‌నగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ బోరిగాం శివారులో చెట్లపొదల్లో శుక్రవారం పేకాటఆడుతున్న ఐదుగురిని పట్టుకుని కేసునమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ముందుస్తు సమాచారంమేరకు బోరిగాంలో తనిఖీలు నిర్వహించి పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నామన్నారు. వారివద్ద రూ.5,550నుంచి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

జీపీ కార్మికుల టోకెన్ సమ్మె


కెరమెరిలో సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు


బెజ్జూరులో సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కెరమెరి/తిర్యాణి/కౌటాల/బెజ్జూరు/రెబ్బెన, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో రెండు రోజుల టోకెన్ సమ్మెలో భాగంగా శుక్రవారం కెరమెరి, తిర్యాణి, కౌటాల, బెజ్జూరు, రెబ్బెన మండలాల గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పనిచేస్తున్న కారోబార్‌లకు సహాయకార్యదర్శులుగా పదోన్నతులు కల్పించాలని, జీవో నెం.51ని రద్దుచేసి జీవోనెం.50 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. కనీసవేతనం రూ.19 వేలు ఇవ్వాలని కోరారు. అంతకుముందు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపట్ల మౌనం పాటించారు. రెబ్బెనలో ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి బోగే ఉపేందర్ పంచాయతీ కార్మికులతో కలిసి సమ్మెలో పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్రప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు.


కౌటాలలో సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు


రెబ్బెనలో సమ్మెను ప్రారంభిస్తున్న బోగే ఉపేందర్

